సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు విఫలం


నిలిచిపోయిన పనులను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

మన్సూరాబాద్‌: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి, ఎల్‌బీనగర్‌ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌ రెడ్డి ఆరోపించారు. మన్సూరాబాద్‌ డివిజన్‌ హయత్‌నగర్‌ పరిధిలోని బాలాజీనగర్‌ నుంచి మదర్‌ డైరీ వరకు జరుగుతున్న ట్రంక్‌లైన్‌ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో సోమవారం వారు పరిశీలించి మాట్లాడారు. ఈ ట్రంక్‌లైన్‌ పూర్తయితే సుమారు 18 కాలనీలకు డ్రైనేజీ సమస్యలు తీరుతుందన్నారు. ప్రణాళికలు లేకుండా పనులు ప్రారంభించారని, బండరాళ్లు వస్తున్నాయని సంబంధిత కాంట్రాక్టర్‌ పనులు నిలిపివేయడంతో మళ్లీ అంచనాలు వేసి నిధులు మంజూరు చేసినా పనులు నిలిచిపోయాయన్నారు. పనులు పూర్తి చేయాలని కాలనీల వాసులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని లేకుంటే ఎల్‌బీనగర్‌ జోనల్‌ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శేషరాజవల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శి శోభన్‌ అరుణ్‌, నాయకులు వంశీవర్ధన్‌రెడ్డి, కందుల సుధాకర్‌, రమావత్‌ సక్రు నాయక్‌, సుజాత, వీరస్వామి, వీరన్న, వెంకట్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

నాగోలు: కొత్తపేట డివిజన్‌ ప్రజయ్‌ నివాస్‌ ఫేజ్‌–1లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. సోమవారం కాలనీ వాసులు ఎమ్మెల్యేను కలిసి వివిధ సమస్యలను వివరించారు. ప్రజయ్‌ నివాస్‌ ఫేజ్‌–1 బ్లాక్‌–2లోని బోరు బిల్లు గతంలో రూ.15 వేలు వచ్చేదని ప్రస్తుతం రూ. లక్షల్లో వస్తుందన్నారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధించిన అధికారులకు ఫోన్‌చేసి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కాలనీలోని పార్క్‌ కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లింగాల రాహుల్‌ గౌడ్‌, రామారావు, లింగేశ్వర్‌, సతీశ్‌ రెడ్డి, అనంత్‌, శ్రీనివాస్‌, ప్రసాద్‌ రెడ్డి, శివ, సుధాకర్‌ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



కార్పొరేటర్‌ సుజాతానాయక్‌ను సత్కరిస్తున్న కాలనీవాసులు

హస్తినాపురం: డివిజన్‌ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హస్తినాపురం డివిజన్‌ కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ అన్నారు. డివిజన్‌ పరిధిలోని శ్రీరమణకాలనీ ఫేజ్‌–1 సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంతోష్‌ ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు కార్పొరేటర్‌ సుజాతనాయక్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానన్నారు. శ్రీరమణకాలనీలో డ్రైనేజీ సమస్య, వీధిదీపాల ఏర్పాటు, రోడ్లను ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాని అందుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరలోనే అధికారులతో సిద్ధం చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరమణకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బాలాజీ, రాజిరెడ్డి, సుధాకర్‌, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గన్నారు.

క్రిస్టియన్‌ లైఫ్‌ సెంటర్‌ చర్చిలో ప్రేమవిందు



మలక్‌పేట: మూసారంబాగ్‌ క్రిస్టియన్‌ లైఫ్‌ సెంటర్‌ చర్చిలో ఆదివారం రాత్రి క్రిస్మస్‌ ప్రేమవిందు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్తుతి కీర్తనలతో ఏసును ఆరాధించారు. అనంతరం పాస్టర్‌ వ్యాకోపదేశం చేశారు. క్రీస్తు జననంపై చిన్నారుల నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మలక్‌పేట ఇన్‌చార్జి తీగల అజీత్‌రెడ్డి, డివిజన్‌ అధ్యక్షుడు చెల్లూరి రఘునందన్‌రెడ్డి, చర్చి ఫౌండర్‌ సీనియర్‌ పాస్టర్‌ రెవరెండ్‌ డాక్టర్‌ ఎంఎస్‌ ప్రభుచరణ్‌, పాస్టర్‌ వన్య ఇమ్మానుయేల్‌, మలక్‌పేట క్రిస్టియన్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎర్రోళ్ల అబ్రాహం మాణిక్యం, కార్యదర్శి శ్రీధర్‌ పాల్గొన్నారు.

10వ తేదీ లోపు ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

చాదర్‌ఘాట్‌: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా వేగవంతంగా చేయాలని మలక్‌పేట సర్కిల్‌–6 డిప్యూటీ కమిషనర్‌ జయంత్‌ తెలిపారు. సోమవారం సర్కిల్‌ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కోసం కొత్తగా నియమించిన సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే కోసం ఇంటింటికి వెళ్లే సిబ్బంది జియో కోఆర్డినేట్స్‌తో ఫొటోలు తీసి అప్‌లోడ్‌ చేయడమే కాకుండా పూర్తి వివరాలు కూడా నమోదు చేయాలని వెల్లడించారు. సర్కిల్‌–6 పరిధిలో ఇప్పటి వరకు 40 శాతం సర్వే పూర్తయిందన్నారు. ఈ నెల 10వ తేదీ లోపు సర్వే పూర్తి చేయాలనే ఉద్దేశంతో 30 మందిని కొత్తగా విధుల్లోకి తీసుకున్నామన్నారు.


మాట్లాడుతున్న డీసీ జయంత్‌

కేలండర్‌, డైరీ ఆవిష్కరణ


కేలండర్‌ ఆవిష్కరిస్తున్న కొండారి మురళీధర్‌రావు

లింగోజిగూడ: ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్‌ సీనియర్‌ నేత, ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్‌ అన్నారు. సంఘం నూతన సంవత్సర డైరీతో పాటు కేలండర్‌ను సోమవారం ఆయన సంఘం సభ్యులు కోటయ్య, బుచ్చిరెడ్డి, యాదగిరి, ఎన్‌ఆర్‌స్వామి, రామచంద్రగౌడ్‌, వీరాస్వామి, నరసింహ, సుబ్బారావుతో కలిసి ఆవిష్కరించారు.

విశ్రాంత పోలీస్‌ అధికారుల సంఘం ఆధ్వర్యంలో..

నాగోలు: నాగోలులోని దేవికి ఫంక్షన్‌ హాల్లో నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం సమావేశంలో రిటైర్డ్‌ ఎస్పీ కొండారి మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన కేలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజమల్లారెడ్డి, అనంతయ్య, ప్రభాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నవీన్‌గౌడ్‌, అబ్దుల్‌ అలీ, ప్రేమ్‌ సింగ్‌ పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న రామ్మోహన్‌గౌడ్‌

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం భద్రం


ఆర్టీఏ కార్యాలయం సమీపంలోని పెట్రోల్‌ పంపు వద్ద..

మూసారంబాగ్‌ డివిజన్‌ పరిధిలో అంతర్గత బీటీ రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయమైన రోడ్లతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు మాత్రం సమస్యల వైపు కన్నెత్తి చూడటం లేదు. రూ. లక్షల్లో ఖర్చుచేసి నిర్మించిన రోడ్లు నాణ్యతా ప్రమాణాలు కొరవడి తక్కువ కాలంలోనే ధ్వంసమవుతున్నాయి. జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్లకు పైపూతలు పూసి చేతులు దులుపుకుంటున్నారు. ఇళ్లల్లో నుంచి వదిలే నీళ్లు రోడ్లపై పారడం, వాటిపైనే వాహనాల రాకపోకల ధాటికి ఛిద్రమవుతున్నాయి. దీనికి తోడు డ్రైనేజీ, లీకేజీలతోనూ రోడ్లు ధ్వంసమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయా ప్రాంతాల్లో పర్యటించి ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు. –మలక్‌పేట

రోడ్లు ఛిద్రమైన ప్రాంతాలు..

- సలీంనగర్‌ తారా అపార్ట్‌మెంట్‌ లైన్‌
- గణేష్‌ టెంపుల్‌ ఎదురుగా, సమీపంలో..
- ఆర్టీఏ కార్యాలయం పెట్రోల్‌ పంపు పక్కలైన్‌లో..
- తీగలగూడ శ్మశాన వాటిక లైన్‌
- ఈస్ట్‌ప్రశాంత్‌నగర్‌లో..
- ఫ్రెండ్స్‌ కాలనీ మీనాక్షి టిఫిన్‌ సెంటర్‌ వద్ద..
- శాలివాహననగర్‌ మెయిన్‌ రోడ్డు


మీనాక్షి టిఫిన్‌ సెంటర్‌ వద్ద..


తీగలగూడ శ్మశాన వాటిక రోడ్డు ఇలా..

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు కాలనీల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ నందిహిల్స్‌ ఫీడర్‌ పరిధిలోని టీచర్స్‌ కాలనీ, నాగార్జునహిల్స్‌, వెంకటేశ్వరహిల్స్‌, చైతన్య హిల్స్‌, నందిహిల్స్‌ రోడ్‌ నెం–1 నుంచి 22 వరకు, ప్రశాంతిహిల్స్‌, 11కేవీ కేశవరెడ్డి ఫీడర్‌ పరిధిలో టీఎస్‌ఆర్‌నగర్‌, ప్రశాంతిహిల్స్‌ రోడ్‌ నెం–1, 2, రాఘవేంద్రనగర్‌, మీర్‌పేట పోస్టాఫీస్‌, పోలీస్‌ స్టేషన్‌, సీతాహోమ్స్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. అదేవిధంగా 11కేవీ అల్మాస్‌గూడ, తిరుమలనగర్‌, ఆర్‌జీకే, సీఎంఆర్‌, శివసాయినగర్‌ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామని లెనిన్‌నగర్‌ ఏఈ వెంకటయ్య తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మరమ్మతుల కారణంగా..

హుడాకాంప్లెక్స్‌: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్‌ డివిజినల్‌ ఇంజినీర్‌ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్‌ పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ మోహన్‌నగర్‌, భవ్య హాస్పిటల్‌ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. 11కేవీ పసుమాముల ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సబితారెడ్డి


సీసీరోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా 21వ వార్డులో రూ.39.50లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మున్సిపాలిటీలో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు నిర్మిస్తున్నామన్నారు. ఒకప్పుడు నడిచి వెళ్లేందుకు కూడా వీలులేనట్లుగా ఉన్న రహదారుల స్థానంలో ప్రస్తుతం బీటీ, సీసీరోడ్లు వేశామన్నారు. పేదలు నివాసం ఉంటున్న దృష్ట్యా బస్తీ దవాఖానాలను కూడా ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో కూడా మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్‌ షేక్‌ అఫ్జల్‌, కౌన్సిలర్‌ పల్లపు శంకర్‌, కమిషనర్‌ వెంకట్రామ్‌, నాయకులు షర్ఫుద్దీన్‌ హామెద్‌, యంజాల జనార్దన్‌, సయ్యద్‌ హుస్సేన్‌, అలీ మన్సూరీ, నగేశ్‌, గోపాల్‌రెడ్డి, బర్కత్‌ అలీ తదితరులు పాల్గొన్నారు.

డీసీకి సన్మానం


డీసీని సన్మానిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్‌: మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్‌ వివిధ పార్కులలో టెలిఫోన్‌ కాలనీ వ్యాయామం (జిమ్‌) పరికరాలు, గ్రీన్‌ హిల్స్‌ కాలనీ వ్యాయామం(ఓపెన్‌ జిమ్‌)పరికరాలు, యాదవ్‌ నగర్‌ కాలనీ వ్యాయామం (ఓపెన్‌ జిమ్‌) పరికరాలు, జనప్రియ కాలనీ వ్యాయామం (ఓపెన్‌ జిమ్‌) పరికరాల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో డిప్యూటీ కమిషనర్‌ సుజాతను సోమవారం కాంగ్రెస్‌ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిధుల విడుదలకు కృషి చేసిన జోనల్‌ కమిషనర్‌ హేమంత కేశవ్‌ పాటిల్‌ మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జ్‌ కిచ్చన్న లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్‌) సీనియర్‌ నాయకులు దేప భాస్కర్‌ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, రామకృష్ణ పురం డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షులు గణేష్‌ నేత, గడ్డి అన్నారం మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ మధుసూదన్‌ రావు, పార్టీ నాయకులు లింగస్వామి గౌడ్‌, జ్ఞానేశ్వర్‌ యాదవ్‌, రమేష్‌ నేత, యాదవ రెడ్డి, శ్రీనివాస్‌ గుప్తా, శివ, ఎల్లయ్య,రాజు నాయక్‌, నగేష్‌ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున జోగేష్‌ చంద్ర నాయక్‌


వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్‌: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల సూచించారు. ఓల్డ్‌మలక్‌పేటలోని కమ్యూనిటీ హాల్లో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ నెల పార్టీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్‌లో ఎక్కువగా మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తుంటారని ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ షఫీఉద్దీన్‌, వైద్యులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో..

మలక్‌పేట: ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ప్రయోజనకరంగా ఉంటాయని మలక్‌పేట యూకో బ్యాంక్‌ చీఫ్‌ మేనేజర్‌ జోగేష్‌ చంద్రనాయక్‌ అన్నారు. ముంతాజ్‌ కాలేజ్‌ రోడ్‌ లైన్‌లోని బ్యాంకులో సోమవారం బ్యాంకు 83వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు సేవలతో పాటు సామాజిక సేవ కార్యక్రమాల్లో యూకో భాగస్వామ్యం అవుతుందన్నారు. ఖాతాదారులు, సిబ్బందితో పాటు ప్రజలకు కంటి, దంత, బీపీ, షుగర్‌ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ మేనేజర్‌ కేవీవీఎస్‌ఆర్‌ఎస్‌ఎన్‌ మురళీ, మేనేజర్‌ రుద్రమ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్‌: డివిజన్‌ పరిధిలోని పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సైదాబాద్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆమె శానిటేషన్‌ అధికారులు, పాఠశాల సిబ్బందితో కలిసి గాంధీనగర్‌ బస్తీలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, ఎస్‌ఎస్‌ గోవిందరెడ్డి, జవాన్‌ నర్సింగ్‌రావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల రిటైర్డ్‌ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్‌ నాయకులు

వనస్థలిపురం: గురుకులాల రిటైర్డ్‌ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి కృషి చేస్తామని టీచర్స్‌ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్‌ సాగర్‌రింగ్‌ రోడ్డు సమీపంలోని బొమ్మరిల్లు ఫంక్షన్‌హాల్లో సోమవారం జరిగిన సాంఘిక సంక్షేమ గురుకులాల రిటైర్డ్‌ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన సంవత్సర కేలండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ అధ్యక్షుడు డి.వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.రాఘవేందర్‌రావు మాట్లాడుతూ.. గురుకుల పెన్షనర్స్‌కు మెడికల్‌ రీయింబర్స్‌మెంట్‌ సౌకర్యం కల్పించాలని, 2024 మార్చి నుంచి రిటైర్‌ అయిన వారికి పెన్షన్‌ బెనిఫిట్స్‌ విడుదల, పెండింగ్‌ డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

సైదాబాద్‌: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్‌ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉ. 10.30 గంటల నుంచి మ. ఒంటిగంట వరకు..

వినాయక్‌నగర్‌, ధోబీఘాట్‌, చంద్రయ్య హట్స్‌, ఖాసీం కాలనీ, మూసారాంబాగ్‌, జ్ఞాన్‌దీప్‌ టవర్‌, కృష్ణతులసీ నగర్‌, ఆండాళ్‌ నిలయం, దిల్‌సుఖ్‌నగర్‌ రోడ్‌, ఎస్‌బీహెచ్‌ బ్యాంక్‌, ఇంద్రానగర్‌, రాజరాజేశ్వరీ టెంపుల్‌, ఎస్‌బీఐ కాలనీ పార్క్‌, డీబీఆర్‌ డయాగ్నస్టిక్‌ సెంటర్‌, తనిష్క్‌ జువెల్లర్స్‌, నోబుల్‌ డిగ్రీ కాలేజ్‌, అక్బర్‌ బాగ్‌, పల్టన్‌ చౌరస్తా, దయానంద్‌ నగర్‌, ఆనంద్‌నగర్‌, మలక్‌పేట పరిసర ప్రాంతాలు.

మ. 2.30 నుంచి సా. 4.30 వరకు..

ఓల్డ్‌ఈద్గా, దారాబ్‌ జంగ్‌ కాలనీ, చోటూ భాయ్‌ కాలనీ, మాదన్నపేట వాటర ట్యాంక్‌, సాయిబాబా టెంపుల్‌, కేజీఎన్‌ బేకరీ, ఓల్డ్‌ పీఎస్‌, ఏపీఏయూ కాలనీ, గడ్డిఅన్నారం, వెంకటేశ్వర కామర్స్‌ కాలేజ్‌, తిరుమలహిల్స్‌, ఇండస్‌ ల్యాండ్‌ బ్యాంక్‌, వాణిజ్యవిహార్‌, నలందా కాలేజ్‌, బిగ్‌ సి, ఎల్‌ఐసీ కాలనీ, న్యూ సైదాబాద్‌ పీఎస్‌, గ్రీన్‌ల్యాండ్‌ కాలనీ, ఫరా కాలనీ, ఎల్‌సీహెచ్‌ కాలనీ, వాటర్‌ట్యాంక్‌, పూసలబస్తీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.23, బెండ రూ.38, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్‌ రూ.13, క్యాబేజీ రూ.15, క్యారెట్‌ రూ.35, దొండ రూ.47, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.39, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.45, బీట్‌రూట్‌ రూ.35, కీర రూ.28, బీన్స్‌ రూ.45, క్యాప్సికమ్‌ రూ.43. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు

చాదర్‌ఘాట్‌: ప్రజావాణిలో రెండు ఫిర్యాదు వచ్చాయని మలక్‌పేట సర్కిల్‌–6 డీసీ జయంత్‌ తెలిపారు. ఓల్డ్‌మలక్‌పేట నుంచి మూసీ పరీవాహక ప్రాంతంలో అక్రమ కట్టడాలపై, అజంపురాలో చమన్‌ వద్ద శానిటేషన్‌పై ఫిర్యాదులు వచ్చాయని వీటిపై సంబంధిత అధికారులతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


బహుమతులు అందజేస్తున్న మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్‌: సంక్రాంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలను నిర్వహించి మహిళలను ఉత్సాహ పర్చడం అభినందనీయమని బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్‌ పరిధిలోని వీరాంజనేయ కాలనీలో నిర్వహించిన ముగ్గుల పోటీలో ప్రతిభ కనబర్చిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. ఈ క్యార్యక్రమంలో సత్యనారాయణ, రామయ్య, భాష, సుధాకర్‌ రావు, రమేష్‌, శంకరయ్య, రెహమాన్‌, అనిల్‌, శంకరయ్యగౌడ్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, సంజీవ్‌ పాల్గొన్నారు.

కళాభారతి ఆధ్వర్యంలో..



వనస్థలిపురం: కళాభారతి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ, శారదానగర్‌ ఆధ్వర్యంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సీనియర్స్‌ విభాగంలో విద్యారాణి, ఝాన్సీ, శ్వేత, జూనియర్స్‌లో భవ్యశ్రీ, సాయిమనోజ్ఞ, లక్ష్మీహారిక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. గత 23 ఏళ్లుగా శారదానగర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ కన్వీనర్‌ కొప్పోలు జగన్నాథ రావు తెలిపారు.దేవాలయ కమిటీ కార్యదర్శి సుబ్బారావు, సుభాషిణి, డా.ఎస్‌.అప్పారావు, అంజనాదేవి, లక్ష్మి, కాలనీ కార్యదర్శి కేఎల్‌ఎన్‌.రావు, ఇందిర, అరుణ, సుధాకర్‌, శ్రీనివాస్‌, మూర్తి పాల్గొన్నారు.

నియామకం

పహాడీషరీఫ్‌: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీ నగర సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా ఆవుల బీచ్‌పల్లి ఎన్నికయ్యారు. సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మర్క సతీశ్‌, ప్రధాన కార్యదర్శి చిలుక శ్రీకాంత్‌, కోశాధికారి నాగరాల నారాయణ, యువజన సంఘం అధ్యక్షుడు చింతల రవి, ప్రధాన కార్యదర్శి సాయికుమార్‌ పర్యవేక్షణలో నూతన కమిటీ ఎన్నికైంది. అధ్యక్షుడు బీచ్‌పల్లితో పాటు ప్రధాన కార్యదర్శిగా సంగెోట్టి లింగస్వామి, కోశాధికారిగా చీర్ల నాగరాజులను ఎన్నుకున్నారు. నగరుల అభ్యున్నతికి నూతన కమిటీ పాటు పడుతుందని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు.